క్లుప్తంగా

చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దళిత హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం, దళితుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డిసెంబర్ 4న ఢిల్లీలో జరిగే మహా ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి .చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం కడప రైల్వే స్టేషన్లో ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దళితులకు సామాజిక న్యాయం సాధన కోసం చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో చలో ఢిల్లీకి దేశవ్యాప్తంగా పిలుపునిచ్చాయని తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వి.అన్వేష్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

కడప కార్పొరేషన్: అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వికలాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీ నిర్వహించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య యాదవ్, జిల్లా అధ్యక్షుడు డి. మాతయ్య కోరారు. శుక్రవారం అంతర్జాతీయ దినోత్సవానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్న సుబ్బయ్య మాట్లాడుతూ వికలాంగులు తమ బస్సు పాసులు, రైలు పాసుల కోసం తమ వికలాంగ సర్టిఫికెట్, రేషన్ కార్డు, ఆధార్ కార్డు, 4 ఫోటోలు వెంట తీసుకురావాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : సీడ్యాప్ సౌజన్యంతో ఉన్నతి స్కీంలో భాగంగా ఉపాధి పథకంలో వంద పని దినాలు పూర్తి అయిన కుటుంబాలలోని 18 సంవత్సరాల నుండి 32 సంవత్సరాల యువతకు, జిల్లాలోని నిరుద్యోగ గ్రామీణ యువతి యువకులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ రీజినల్ కోఆర్డినేటర్ ఎస్ సుబ్బరామిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. నాలుగు నెలల కాలవ్యవధితో ఉచితంగా ఎలక్ట్రానిక్స్ రంగంలో కంప్యూటర్ హార్డ్వేర్,హెల్త్ కేర్ రంగంలో ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్, ఐటీ సెక్టార్ రంగంలో జూనియర్ సాఫ్ట్వేర్ డెవలపర్ కోర్సు లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి కలిగిన వారు కడపలోని జిల్లా కోర్టు ఎదురుగా ఉన్న నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ లోగానీ, సెల్ నెంబరు 90630 82227లోగానీ సంప్రదించాలని కోరారు.

రక్తదానం ఉద్యమంలా సాగాలి



రక్తదాతలను అభినందిస్తున్న అతిథులు

కడప సెవెన్‌రోడ్స్ : రక్తదాన కార్యక్రమం ఒక ఉద్యమంగా కొనసాగాలని డీఎస్పీ రమాకాంత్, ఎన్ఆర్‌జీఎస్ డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి జుబేద అన్నారు. దూదేకుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు మన్సూరు అక్బర్ ఆధ్వర్యంలో శుక్రవారం పాత కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన 13వ రక్తదాన శిబిరాన్ని వారు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడిన వారికి, గర్భవతులకు రక్తం అవసరమవుతుందన్నారు. డీహెచ్‌పీఎస్ రక్తదాన శిబిరాన్ని ఏటా కొనసాగించడం అభినందనీయమని కొనియాడారు. మన్సూరు అక్బర్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అనేక మంది యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు ముక్తియార్, అమీర్‌బాబు, సుబాన్‌బాష, నూర్ మహమ్మద్, రిటైర్డ్ ఎస్సీ షేక్ షావలి, నబీరసూల్, హరిప్రసాద్, గోవర్ధన్‌రెడ్డి, డీహెచ్‌పీఎస్ నాయకులు నజీర్, హుసేన్, బాబయ్య పాల్గొన్నారు.

భూమి పూజ



భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి

కడప ఎడ్యుకేషన్: కడప నగర సమీపంలోని పబ్బాపురంలో శుక్రవారం పబ్బాపురం ప్లాట్స్ డెవలప్‌మెంట్ కమిటీ, కడప టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో నూతన ఆఫీసు బిల్డింగ్ నిర్మాణానికి ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో కలిసి ప్రత్యేక పూజ నిర్వహించి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల నుంచి టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి సంబంధించిన స్థలాల సమస్య ఇప్పుడిప్పుడే ఒక కొలిక్కి వస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో కడప టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షుడు చల్లా విశ్వనాథరెడ్డి, ప్రధాన కార్యదర్శి బాలశౌరిరెడ్డి, డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు, ప్లాట్స్ హక్కుదారులు పాల్గొన్నారు.

5న వాహన వేలం

సిద్దవటం : ద్విచక్ర వాహనానికి ఈనెల 5న బహిరంగ వేలంపాటను నిర్వహిస్తున్నట్లు సిద్దవటం ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో సీఐ ఉరుకుందమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిద్దవటం ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో పోలీసుస్టేషన్ ఆవరణలో ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తామన్నారు.



పునర్వసు పూజలు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీలక్ష్మి వెంకటేశ్వరునికి శుక్రవారం పునర్వసు పూజలు నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని తొలుత శ్రీదేవి భూదేవి అమ్మవార్లతో కలిసి కడపరాయుడి ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు చేసి కనుల పండువగా అలంకరించారు. అనంతరం పల్లకీపై తిరుచ్చి అలంకారంతో కొలువుదీర్చారు. మాడవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. వీధుల్లోని భక్తులు పూజా ద్రవ్యాలు సమర్పించి స్వామికి మొక్కుకుని హారతులు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విన్నపం

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాల్లో పీజీ ఉర్దూ ప్రవేశ అభ్యర్థులకు రెండో దశ కౌన్సిలింగ్‌ను నిర్వహించాలని రూటా లెక్చరర్స్ వింగ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వసీవుల్లా బక్తియారిసాహేబ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై శుక్రవారం డిప్యూటీ సీఎం అంజాద్‌బాషను కడపలో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. డిప్యూటీ సీఎం స్పందిస్తూ రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మండలి చైర్మెన్ హేమచంద్రారెడ్డికి ఫోన్ ద్వారా సమస్యను వివరించి రెండవదశ కౌన్సిలింగ్‌ను నిర్వహించాలని కోరారు.



అభినందన

వైవీయూ : పలు టోర్నమెంట్‌లలో విజేతలుగా నిలిచిన కడప ప్రభుత్వ పురుషుల కళాశాల క్రీడాకారులకు అభినందన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన సన్మాన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా. జి. రవీంద్రనాథ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి విజేతలను సన్మానించారు. కళాశాల ఇన్‌చార్జి ఫిజికల్ డైరెక్టర్ టి. హజరతయ్య మాట్లాడారు. పతకాలు సాధించిన సింధూర్, జి. సింహాచలం, ఎం.లోకేష్‌లను సన్మానించారు. అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో వ్యక్తిగత విభాగంలో విజేతగా నిలిచిన సింధూర్‌కు రూ.2500 నగదు బహుమతిని అందజేశారు.



అవగాహన



వైవీయూ : ఎయిడ్స్ వ్యాధి పట్ల సంపూర్ణ అవగాహనతో ప్రజలను చైతన్యవంతం చేయాలని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వీసీ మాట్లాడుతూ చాపకింద నీరులా విస్తరించే ఈ వ్యాధిని కట్టడి చేసేందుకు అందరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి మాట్లాడారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ వెంకట్రామిరెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్లు బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా గౌరమ్మ గ్రామోత్సవం



గ్రామోత్సవంలో జ్యోతులను ప్రదర్శిస్తున్న భక్తులు

వల్లూరు : మండలంలోని పెద్దపుత్త గ్రామంలో గౌరమ్మతల్లి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పల్లకిపై కొలువు దీర్చి ట్రాక్టర్‌పై గ్రామోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారి వెంట సాగిన జ్యోతుల ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నృత్యాలు చేస్తూ జ్యోతి ఉత్సవాలను నిర్వహించారు. అమ్మవారి నిమజ్జన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి

కమలాపురం : మండలంలోని రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు తప్పని సరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం దేవరాజుపల్లె, ఎల్లారెడ్డిపల్లె గ్రామాలలో జరుగుతున్న ఈ-క్రాప్ నమోదును ఆయన పరిశీలించి మాట్లాడారు. మండలంలో రబీ సీజన్లో బుడ్డ శనగ 1406 హెక్టార్లలో, మినుము 1500 హెక్టార్లలో, పెసర 20 హెక్టార్లలో, వేరుశనగ 250 హెక్టార్లలో నువ్వులు 10 హెక్టార్లలో సాగైందన్నారు. అయితే పంటలు సాగు చేసిన ప్రతి రైతు తప్పని సరిగా ఈ-క్రాప్ బుకింగ్‌తో పాటు ఈకేవైసీ చేసుకోవాలన్నారు. ఇవి చేస్తేనే అన్ని ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయన్నారు. అలాగే ఉద్యానవన పంటలు సాగు చేసిన రైతులు కూడా ఈ-క్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఓ సరస్వతి, ఏఈఓ దస్తగిరి, వీఏఏలు మంజుల, బాబు, రైతులు పాల్గొన్నారు.

జగనన్న మళ్లీ సీఎం అయితేనే అభివృద్ధి

కడప కార్పొరేషన్: జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే జిల్లా అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని వైఎస్సార్‌సీపీ క్లస్టర్ పార్టీ అధ్యక్షుడు తోటక్రిష్ణ, జేసీఎస్ ఇన్‌చార్జి మల్లికార్జున అన్నారు. శుక్రవారం స్థానిక 7 డివిజన్‌లోని శంకరాపురంలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించి, ప్రభుత్వ సంక్షేమ పథకాల డిజిటల్ బోర్డును ప్రదర్శించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ పద్నాలుగేళ్ల అధికారంలో ఉన్న తెలుగుదేశం పార్టీ జిల్లాకుగానీ, కడప నగరానికి చేసిందేమీ లేదన్నారు. వైఎస్సార్ హయాంలో జిల్లా అభివృద్ధి చెందిందన్నారు. ఆ తర్వాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే జిల్లా అభివృద్ధి చెందిందని తెలిపారు. టీడీపీ పాలనకు, వైఎస్సార్‌సీపీ పాలనకు మధ్య తేడాను గుర్తించాలని కోరారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్లు పంచి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 7వ డివిజన్ కార్పొరేటర్ మల్లీశ్వరి, డివిజన్ ఇన్‌చార్జి గంగరాజు, 6వ డివిజన్ కార్పొరేటర్ నాగేంద్ర, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు పాల్గొన్నారు.



ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

స్థాయి తెలుసుకొని మాట్లాడాలి

కడప కార్పొరేషన్: టీడీపీ నాయకుడు ఎంపీ సురేష్ తన స్థాయి తెలుసుకొని మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్, నాయకులు కంచుపాటి బాబు, కోఆప్షన్ సభ్యురాలు బండి మరియలు, కార్పొరేటర్ కె. బాబు అన్నారు. శుక్రవారం పాత మున్సిపల్ కార్యాలయం వద్దనున్న డిప్యూటీ సీఎం క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డిలను విమర్శించే స్థాయి ఎంపీ సురేష్‌కు లేదన్నారు. వారు ఎన్నో ఏళ్లనుంచి కడపలోనే నివాసం ఉంటూ రాజకీయాలు చేస్తున్నారని, అంచెలంచెలుగా ఉన్నత స్థాయికి ఎదిగారన్నారు. టీడీపీకి కడపలో నాయకులు కరువై రాయచోటి నుంచి అభ్యర్థిని తెచ్చుకున్నారని ఎద్దేవా చేశారు. టీడీపీ ప్రభుత్వంలో కడప నగరాభివృద్ధికి ఎన్ని నిధులు ఇచ్చారో, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎన్ని నిధులు మంజూరు చేసి ఎన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నారో చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకులు బండి ప్రసాద్, త్యాగరాజు, చైతన్య, పి. సంపత్ కుమార్, లక్ష్మినారాయణ, సీహెచ్ సునీల్, ఎం. రవిశేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం నాయకులు

ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

కమలాపురం : ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని కమలాపురం సీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్, ఐసీటీసీ కౌన్సిలర్ రాజారెడ్డి తెలిపారు. ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో కరస్పాండెంట్ రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు, వైద్య, ఆరోగ్య సిబ్బందితో కలసి ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ రహిత సమాజాన్ని నిర్మిద్దామని, ఈ సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలన్నారు. హెచ్ఐవీ బారిన పడ్డవారిపై వివక్ష చూపరాదని, వారు నిరాదరణకు గురికాకుండా సమాజంలో గౌరవంగా జీవించేటట్లు చూడాలన్నారు. ఇది అంటు వ్యాధి కాదని, అంటించుకునే వ్యాధి అన్నారు. సురక్షిత లైంగిక సంబంధాలు, లైంగిక చర్యల్లో కండోమ్ వాడటం, చికిత్సల సమయంలో కొత్త సూదులు, సిరంజీలు వాడాలన్నారు. రక్త మార్పిడి సమయంలో గుర్తింపు పొందిన రక్తనిధి కేంద్రాల నుంచి మాత్రమే రక్తాన్ని పొందడం వలన ఎయిడ్స్ వ్యాధి బారిన పడకుండా ఉండవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎయిడ్స్‌కు నివారణ ఒక్కటే మార్గం

పులివెందుల టౌన్ : ఎయిడ్స్‌కు మందులేదు.. నివారణ ఒక్కటే మార్గమని పులివెందుల అర్బన్ సీఐ రాజు తెలిపారు. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ దినం సందర్భంగా స్థానిక కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సీఐ రాజు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ పూలంగళ్ల సర్కిల్ వరకు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ యేసురత్నం, లయోలా డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. అలాగే ఎయిడ్స్ దినం సందర్భంగా స్థానిక లయోలా డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కడప స్టెప్ డైరెక్టర్ సుబ్బరాయుడు, బోగా పార్వతమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ వారి బ్లడ్‌బ్యాంక్ బృందం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సంకటహర చతుర్థి

కడప కల్చరల్: కడప నగరంలోని హనుమప్పవీధి లోగల శ్రీ భద్రావతి భావనారుషి ఆలయంలో సంకటహర చతుర్థిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆమంచి శ్రీనివాసులు పర్యవేక్షణలో గణపతి ఉత్సవమూర్తికి పంచామృతాభిషేకం నిర్వహించారు. కార్తీక మాసంలో వచ్చే ఈ చతుర్థిని పుణ్యదాయకంగా భావిస్తూ స్థానికంగా గల 108 మంది ముత్తయిదువులు పవిత్ర కలశాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆ పుణ్య జలాలతో గణపతికి, శివునికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు రంగసముద్రం సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ఈ సందర్భంగా గణపతిహోమం, షోడశోపచార పూజలు, మహా మంగళహారతి నిర్వహించారు.

4న శ్రీ వెంకటేశ్వర కల్యాణం

కడప కల్చరల్ : శ్రీ గోవిందమాల భక్తబృందం ఆధ్వర్యంలో ఈనెల 4వ తేదీన శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని నిర్వహించనున్నారు. కడప నగరంలోని నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో ఉదయం 6 గంటల నుంచి ఈ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా వసంతోత్సవం, గ్రామోత్సవం కూడా నిర్వహిస్తారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవ, అనంతరం విశ్వరూప దర్శనం, 7 గంటలకు బాలభోగ ప్రథమ ఆరాధన, 9 గంటలకు శేష హనుమ, గరుడ వాహన అలంకారం నిర్వహిస్తారు. ఉదయం 7.30 గంటలకు స్థానిక హౌసింగ్‌బోర్డు శ్రీ కోదండ రామాలయం వద్ద నుంచి ధర్మకర్త డి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో 108 మంది ముత్తయిదువులు 108 కలశాలను, కోలాటాలతో కళాక్షేత్రం వరకు శోభాయాత్రగా రానున్నారన్నారు. తిరుమంజన సేవ, అనంతరం సాయంత్రం 4 గంటలకు తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తారు.

ఉచిత యోగా, ధ్యాన శిక్షణ

కడప కల్చరల్ : నగరానికి చెందిన విశ్వాత్మ పిరమిడ్ యోగా ధ్యాన కేంద్రంలో శుక్రవారం ఉదయం నుంచి యోగా, ధ్యాన శిక్షణను ప్రారంభించారు. పట్టు పరిశ్రమశాఖ రిటైర్డ్ డైరెక్టర్ నాగరంగయ్య, యోగా గురువులు జీవీఎస్ రెడ్డి, డాక్టర్ ఊర్మిళాదేవి సూర్య నమస్కారాలతో శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆసనాలు, ప్రాణాయామాలు కూడా నేర్పారు. ఈ శిక్షణ ప్రతిరోజు ఉంటుందని తెలిపారు. రోజు గంట పాటు వ్యాయామంతో కూడిన యోగా ద్వారా ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు.

సస్యరక్షణపై అవగాహన ఉండాలి

చెన్నూరు : మామిడి తోటల సస్యరక్షణపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఉద్యానశాఖ అధికారిణి జ్యోతిర్మయి తెలిపారు. మండలంలోని గుర్రంపాడు గ్రామ పంచాయతీలో శుక్రవారం ఏర్పాటు చేసిన మామిడి రైతుల శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రైతులు మట్టి పరీక్ష చేసుకోవాలని, మామిడి పూత బాగా రావడానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఉద్యాన రైతులు గ్రూపుగా ఏర్పడి మండలంలో కలెక్షన్ సెంటర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీనికి గాను ఉద్యానశాఖ నుంచి 75 శాతం రాయితీ కల్పిస్తామని ఆమె తెలిపారు. వ్యవసాయాధికారిని శ్రీదేవి మాట్లాడుతూ ట్రైకోడర్మవిరిడి, సూడో మోనాస్ వినియోగం గురించి, వాటి లాభాల గురించి వివరించారు. నువ్వులు, వేరుసెనగ పంటల్లో సూటి ఎరువులు అయిన సింగిల్ ఫాస్ఫేట్‌ని వాడటం ద్వారా నూనె శాతం పెంచుకోవచ్చని తెలిపారు. రబీలో ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఆమె రైతులకు సూచించారు. కార్యక్రమంలో కేవీకే సైంటిస్ట్ డాక్టర్ మానస, సర్పంచ్ ప్రమీల, వ్యవసాయ విస్తరణ అధికారి ఇందిర, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఉద్యానశాఖ అధికారిణి జ్యోతిర్మయి

ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన

శ్రీ వెంకటేశ్వర వ్యవసాయ కళాశాలకు చెందిన బీఎస్సీ ఫైనల్ ఇయర్ విద్యార్థులు శుక్రవారం బుద్ధాయపల్లిలోని రైతు భరోసా కేంద్రం పరిధిలో రూరల్ అగ్రికల్చరల్ వర్క్ ఫైనాన్షియల్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలకు చెందిన విద్యార్థులు ఇక్కడి గ్రామ పరిస్థితులపై అవగాహన చేసుకుని ఆధునిక వ్యవసాయ పద్ధతులపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

వీరపునాయునిపల్లె : అర్హులైన వారందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని మండల అధ్యక్షుడు రఘునాథ్‌రెడ్డి, రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ వీరప్రతాప్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం మండలంలోని యు.వెంకటాపురం సచివాలయంలో నిర్వహించిన ఏపీకి ముఖ్యమంత్రి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లే నా సైన్యమని పూర్తి నమ్మకంతో ఉన్నాడని ఆయన పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో వలంటీర్లకు మంచి భవిష్యత్ ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచు పుల్లారెడ్డి, ఎంపీటీసీ లక్ష్మి రామాంజనమ్మ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజలకు చేసిన మంచిని ప్రజలకు వివరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య తెలిపారు. తుమ్మలూరు గ్రామ సచివాలయంలో శుక్రవారం ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రాభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమన్నారు. ఈ నాలుగున్నరేళ్లల్లో సీఎం జగన్ అనే సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుచేశారు. అనంతరం సచివాలయం పరిధిలో లబ్ధిదారులకు అందిన సంక్షేమ పథకాల వివరాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్‌లు శ్రీనువాసులు, నాగమల్లేశ్, ఎంపీటీసీ ఈశ్వరయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రవీంద్రారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.



వీఎన్‌పల్లె : సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరిస్తున్న మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి

పాఠశాలల గ్రాంట్లు విడుదల చేయాలి



సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారికి వినతిపత్రాన్ని సమర్పిస్తున్న ఎస్టీయూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలలకు రావాల్సిన నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమణారెడ్డి, వెంకటసుబ్బయ్యలు కోరారు. ఈ విషయమై శుక్రవారం సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు అధికారి అంబవరం ప్రభాకర్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

వేతనాలను పెంచాలి

కడప ఎడ్యుకేషన్: సమగ్రశిక్షలో పనిచేస్తున్న తమకు వెంటనే వేతనాలు పెంచాలని జిల్లా సమగ్రశిక్ష ఒప్పంద ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై శుక్రవారం ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని కడపలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్రశిక్షలో 12 సంవత్సరాలుగా ఒప్పంద ఉద్యోగులుగా పనిచేస్తున్నామన్నారు. చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నామని ఆవేదనను వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు పెంచాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీఆర్‌పీలు ఆదిమూలం శంకర్, నాగమునికుమారి, హజరీబాను, జమీలున్నీసా, మంగమ్మ, రామచంద్ర, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ జట్టుకు రిమ్స్ విద్యార్థి



వైద్య విద్యార్థి ఆదిత్యను అభినందిస్తున్న రిమ్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ

కడప అర్బన్: వైద్యవిద్యార్థుల ఇంటర్ యూనివర్సిటీల వాలీబాల్ పోటీలకు డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ తరపున వాలీబాల్ జట్టుకు కడప ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) మొదటి సంవత్సరం వైద్య విద్యార్థి ఆదిత్య ఎంపికయ్యాడు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. సురేఖ ఆ విద్యార్థిని అభినందించారు. శుక్రవారం తన ఛాంబర్‌కు విద్యార్థితో పాటు వచ్చిన కడప రిమ్స్ స్పోర్ట్స్ కమిటీ వారిని ప్రిన్సిపాల్ అభినందించారు. డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీ పరిధిలోని అన్ని మెడికల్ కళాశాలల నుంచి వచ్చిన 140 మందిలో 12 మందిని వాలీబాల్ జట్టుకు ఎంపిక చేయగా వారిలో ఆదిత్య స్థానం దక్కించుకున్నాడు. ఈక్రమంలో అతనికి ప్రిన్సిపాల్ మెడల్‌ను, వాలీబాల్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో కడప రిమ్స్ స్పోర్ట్స్ కమిటీ సభ్యులైన డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ వెంకట సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో విత్తన ఎంపిక ముఖ్యం

చాపాడు : రైతులు పంటలు సాగు చేసే సమయంలో విత్తన ఎంపిక ఎంతో ముఖ్యమని ఏఆర్ఎస్ సీనియర్ సైంటిస్టు జాన్సన్ అన్నారు. మండల పరిధిలోని వెదురూరు గ్రామంలో గ్రామీణ విత్తనోత్పాధి పథకం కింద శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సైంటిస్టు మాట్లాడుతూ ఏ రకమైన విత్తనాలు అధిక దిగుబడులు ఇస్తాయో వాటిని ఎంచుకోవటం ముఖ్యమన్నారు. విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయాలని దీనిపై ప్రతి రైతు దృష్టి సారించాలన్నారు. వరి, మినుము సాగు చేసిన రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రస్తుతం సాగులో ఉన్న వరి పంటలను ఆశించిన తెగుళ్లపై అవగాహన కల్పించారు. యూరియాను అవసరం మేరకూ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీ ఏఓ పద్మజ, మండల వ్యవసాయాధికారి మ్యాగీ, వీఏఏలు వెంకటరమణ, బేబి, భార్గవి తదితరులు పాల్గొన్నారు.

రేపు అయ్యప్పస్వామి లక్షార్చన

ప్రొద్దుటూరు కల్చరల్ : పెన్నానదీ తీరంలోని శ్రీ అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి అయ్యప్ప సేవా సంఘం అధ్యక్షుడు నామా రమేష్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్పస్వామి లక్షార్చన నిర్వహించనున్నట్లు ఉపాధ్యక్షుడు వీఎస్ మనోహర్ తెలిపారు. శుక్రవారం ఆలయంలో లక్షార్చన ఆహ్వాన పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 40 ఏళ్లుగా లక్షార్చన మహోత్సవాన్ని దాతల, భక్తుల సహకారంతో వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. దాదాపు 40 వేల మంది భక్తులకు అన్న ప్రసాదాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

ఉదయం 9 గంటలకు లక్షార్చన ప్రారంభమౌతుందని, దాదాపు 2వేల మంది అయ్యప్ప దీక్షదారులు పాల్గొంటారన్నారు. ఈ నెల 12న సాయంత్రం అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్వామి అయ్యప్ప సేవా సంఘం కార్యదర్శి పద్మనాభయ్య, కోశాధికారి వినోద్‌కుమార్, కొవ్వూరు రమేష్‌రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు



రాయచోటి టౌన్ : పట్టణంలోని శ్రీ వీరభద్ర స్వామి వారి ఆలయంలో శ్రీ భద్రకాళీ అమ్మవారికి రాహుకాల పూజలు నిర్వహించారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పాలంరెడ్డి విజయ, ఆలయ ఈఓ డివి రమణారెడ్డిల ఆధ్వర్యంలో శంకరయ్యస్వామి, కృష్ణస్వామి, రాచరాయ యోగీ స్వాముల ఆధ్వర్యంలో పూజలు నిర్వహించి రంగురంగుల గాజులతో అందంగా అలంకరించి భక్తులకు దర్శన ఏర్పాటు చేశారు. మహిళలు అమ్మవారికి నిమ్మకాయలపై వత్తులు వెలగించి హారతులు పట్టారు. అర్చకులు రాహుకాల పూజ విశేషాలను వివరించి చెప్పారు.